www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 జూన్ 2023

5

ఏలూరు



నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు



ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు ఈ నెల మూడో తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 నిముషాల వరకు స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జెడిపి సిఇఒ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు తప్పనిసరిగా జిల్లా ప్రజా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

'ఫ్రై'డే..

- ఠారెత్తిస్తున్న రోహిణి కార్తె
- ఉక్కపోత, వడగాల్పులతో జనం విలవిల
- అల్లాడుతున్న పక్షులు, మూగజీవాలు


నిర్మానుష్యంగా ఉన్న ముదినేపల్లి సెంటర్


మృతి చెందిన కోళ్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోహిణికార్తె ఠారెత్తిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలకు జనం మాడు పగులుతోంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు వడగాల్పులు తోడై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం ముదినేపల్లి మండలంలో 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోయారు. మధ్యాహ్నం వేళల్లో మండలంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన రహదారులపై జన సంచారం, వాహనాల రద్దీ అంతంతమాత్రంగానే కన్పిస్తోంది. బస్సుల్లో ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. స్థానిక బస్‌స్టేషన్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది. గత నెలరోజులుగా శీతలపానీయాలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపానికి పిల్లలు, వృద్ధులతోపాటు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రత ప్రభావం ఆక్వా రంగంపై చూపుతోంది. చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు ఎండలకు బాగా వేడెక్కి ఆక్సిజన్ సమస్యతో కొన్ని రకాల చేపలు, రొయ్యలు ఉక్కిరిబిక్కిరవుతూ మృత్యువాత పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వడగాల్పులకు మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిన్నటి వరకు మే నెల ఉష్ణోగ్రతలతో సతమతమైన జనం నేడు రోహిణి కార్తె ప్రభావానికి భీతిల్లుతున్నారు. దీంతో మండలం నిప్పుల కొలిమిగా మారడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు జనం నానాతంటాలు పడుతున్నారు. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉదయం ఏడు గంటల నుంచే విపరీతంగా ఉక్కపోత మొదలవుతోంది. దీనికితోడు గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరచూ ఏర్పడటంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉక్కపోతలకు ఒళ్లు మంట, శరీరంపై చిన్నచిన్న పొక్కులు, దురద వస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత బాగా పెరిగితే ప్రజలకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎండల ప్రభావంతో రేకుల షెడ్లలో నివశించే జనం నరకం అనుభవిస్తున్నారు. ఇళ్లల్లో ఫ్యాన్లు తిరుగుతున్నా చెమటలు తగ్గడం లేదు. ఎండలకు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. రైతులు పశువులను ఊర చెరువుల్లో దింపి ఎండల నుంచి కాపాడుకుంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఫారాల్లో ఉన్న కోళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లు, ఎసిలు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలకు ఇళ్లలోని అన్ని గృహోపకరణాలు వేడెక్కిపోతున్నాయి. గత నెల 25న మొదలైన రోహిణి కార్తె ఈ నెల ఆరో తేదీ వరకు ఉండడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.


దీక్షలో ఉద్యోగ సంఘాల నేతలు


సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరాహారదీక్ష

ప్రజాశక్తి - భీమడోలు

సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు భీమడోలు పాత తాలూకా కేంద్రం స్థాయిలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథి సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ఎస్‌వి.రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా పరిధిలోని వివిధ పాత తాలూకా కేంద్రాల వద్ద దశలవారీగా రిలే నిరాహారదీక్ష చేపడుతున్నామన్నారు. అనంతరం ఈ నెల 28, 29, 30వ తేదీల్లో జిల్లా కేంద్రాల వద్ద నిరాహార దీక్షలు ఉంటాయన్నారు. ఆ తర్వాత జులై ఐదో తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు అన్ని జిల్లా కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన సిపిఎస్ బ్లాక్‌డే పాటిస్తామన్నారు. అక్టోబర్ 31న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. నవంబర్ ఒకటో తేదీ తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు తాలూకా యూనిట్ సంఘం నాయకులు పి.ప్రభాకర్, కందులపాటి ధర్మాంజనేయవరప్రసాద్ (శంకర్), వెజ్జు విజయ్‌కుమార్, షేక్ ఇంతియాజ్, ఎన్ఎంఆర్ సంఘం నాయకులు నాగరాజు, ఒప్పంద కార్మికుల సంఘ నాయకులు బి.విజయవర్ధన్ పాల్గొని ప్రసంగించారు. [illegible] సంఘం, ప్రజారోగ్య వైద్యఉద్యోగుల సంఘం, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, సిపిఎస్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాసితుల పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు


మాట్లాడుతున్న నాగేంద్రరావు

ప్రజాశక్తి - కుక్కునూరు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20 నుండి చేపట్టే మహాపాదయాత్రలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు కోరారు. మహాపాదయాత్ర జయప్రదం కోరుతూ మర్రిపాడు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ గత సంవత్సరం జులైలో గోదావరికి వచ్చిన వరదల నుండి ప్రజలు ఇంత వరకూ కోలుకోలేదన్నారు. పోలవరం మునక ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎటువంటి అభివృద్ధికీ, సంక్షేమానికీ నోచుకోక అడవుల్లో చెట్లు, పుట్టలపాలై బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం డ్యామ్ పూర్తికాక ముందే గత జులైలో వరదలతో వందలాది గ్రామాలు మునిగిపోయాయని గుర్తు చేశారు. ఆ వరదల్లో మునిగిపోయిన గ్రామాల ప్రాతిపదికన పోలవరం నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలని నాటి నుండి సిపిఎంతో సహా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకూ పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం వరదల్లో మునిగిపోయిన వారికీ పూర్తి నష్టపరిహారం చెల్లించాలన్నారు. యాత్ర కుక్కునూరు మండలంలో చీరవల్లి వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తుందనితెలిపారు. సమావేశంలో నేతలు యర్నం సాయికిరణ్, భయ్యాన శ్రీను,కోట మోహన్‌రావు, నిర్వాసితులు చిన్నరాజులు, వెంకట్రావు, శ్రావణి పాల్గొన్నారు.



నినదిస్తున్న కార్మికులు

రెజ్లర్ల పోరుకు మద్దతుగా ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు

ఢిల్లీలో మహిళా రెజ్లర్ల పోరాటంపై మోడీషా ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధాన్ని నిరసిస్తూ ఏలూరు మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన చేపట్టిన నిరసననుద్దేశించి రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు రెడ్డి అప్పలనాయుడు, ఎం.రాము, గడసాల రమణ, కోరాడ అప్పారావు, బండి నాగేశ్వరరావు, గురుమూర్తి, విజయ్, నగిరెడ్డి లక్ష్మణ్, తాబేలు శివ, శ్రీను, గౌరినాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌చే జనన్న విద్యాకానుక పాయింట్ పరిశీలన


పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు అర్బన్, రూరల్ పరిధిలోని 119 పాఠశాలలకు సంబంధించి స్థానిక సెయింట్ గ్జేవిఆర్ వద్ద ఉన్న జగనన్న విద్యాకానుక (జెవికె) పాయింట్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న విద్యాకానుక ద్వారా ఇప్పటి వరకు తీసుకుంటున్న నోట్ పుస్తకాలను, షూస్, పాఠ్యపుస్తకాలు, సాక్స్‌ల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. జివికె పాయింటులోని అన్ని వస్తువులను, టెక్స్‌బుక్స్‌ను కూడా పరిశీలించారు. ఇంకా యూనిఫారం, బ్యాగులు, బెల్ట్‌లు రావాలని ఎంఇఒ ఎస్.నరసింహమూర్తి కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులందరికీ జివికె కిట్లు ఏవిధమైన లోటుపాట్లు లేకుండా ఇవ్వాలని, షూస్‌కు సంబంధించి తరగతివారీగా కొంతమంది విద్యార్థులను పిలిచి వారికి తొడిగి మార్పులు చేర్పులు ఉంటే స్టాక్ పాయింట్లోనే సరి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్, సిఎంఒ రవీంద్ర, జిసిడిఒ సబొహిసుల్తానా, మణిసింగ్, అసిస్టెంట్ ఇంజినీరు శ్రీకాంత్, ఎపిఎం రాధాకృష్ణ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పెదపాడు


నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెదపాడు జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆధునికీకరణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. జూనియర్ కళాశాలకు ఇప్పుడున్న నాలుగు తరగతుల ఆధునికీరణకు మంజూరైన కాంపోనెంట్స్ అన్నింటికీ మొత్తంగా మంజూరైన రూ.28 లక్షలకుగాను రూ.10 లక్షలు రివాల్వింగ్ ఫండు పడగా ఇప్పటివరకు రూ.7.30 లక్షలు ఖర్చు చేసినట్లు, మరుగుదొడ్లు కూడా నిర్మించినట్లు ఎఇ కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే జూన్ నెలాఖరుకు పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా నాలుగు తరగతి గదులు కళాశాలకు అవసరమైనందున వాటికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయించి పంపించాలని ఎఇ సదాశివరావును ఆదేశించారు. సిమెంట్, ఇసుక కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చూసుకోవాలని, జిల్లా పరిషత్ పాఠశాలలో శిథిల భవనాన్ని వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమార్‌రాజు, ఎఇ సాయికృష్ణ, ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

మట్టి, ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే నిఘా పెట్టి అక్రమ రవాణాను అరికట్టాలని, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ మట్టి, ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందని, అరికట్టాల్సిన యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారులపై రాజకీయ నాయకుల ఒత్తిడి తీవ్రంగా ఉందని, దీంతో వారు కూడా ఏమి చేయలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలోని ఎర్రకాలువ ప్రాజెక్టు వద్ద జెసిబి, పొక్లెయిన్ ద్వారా మట్టి తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇప్పటికే సుమారు రెండెకరాల మేరకు మట్టిని అక్రమంగా రవాణా చేశారని, ఇది దాదాపుగా రూ.కోటి విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అక్రమ రవాణాకు ఎటువంటి పర్మిషన్లూ లేవని, ఈ విషయమై సిపిఎంగా గతంలో ఆందోళన చేసినప్పుడు కొంతమేర రవాణాను నిలుపుదల చేసినా తిరిగి రాత్రి వేళల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా సాగుతోందని పేర్కొన్నారు. అధికారులను గట్టిగా నిలదీస్తే రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందని, మేమేమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇదే విధంగా జగనన్న కాలనీల కోసమని, గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణం కోసమని చెబుతూ జిల్లాలోని కుక్కునూరు, టి.నర్సాపురం, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో ఇసుక, మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీల చేత చేయించాల్సిన పనులను కూడా చేయించకుండా కొన్నిచోట్ల చెరువులు, గుంతలు కూడా యంత్రాలతో తవ్వి మట్టిని తీసుకుపోతున్నారని, ఉపాధి హామీ కూలీల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరపాలని, రాజకీయ నాయకుల ఒత్తిడికి గురి కాకుండా అనుమతి లేని అక్రమ రవాణా వాహనాలను నిలుపుదల చేయాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖాధికారి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ట్రాన్స్‌కో ఇఇ టి.శశిధర్

ప్రజాశక్తి - ఏలూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ట్రాన్స్‌కో ఇఇ టి.శశిధర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ భవన ప్రాంగణంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. శశిధర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులందరూ ఎల్‌ఇడి బల్బులు, ట్యూబ్‌లైట్లు వాడాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ప్రజా రవాణానే ఉపయోగించుకోవాలన్నారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు, రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల ఇంజిన్ ఆఫ్ చేయాలని, తక్కువ దూర ప్రయాణాలకు సైకిల్ వాడాలని సూచించారు. పెట్రోలు, డీజిల్ వాహనాలకు బదులు సిఎన్‌జి, విద్యుత్ వాహనాల వాడకానికి ప్రాధాన్యతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యుత్ వినియోగదారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని ఆందోళన

ప్రజాశక్తి - కైకలూరు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వైసిపి నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని కోరుతూ జనసేన ఆధ్వర్యాన శుక్రవారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. జనసేన ప్రధాన కార్యాలయం నుండి నాయకులు నల్ల దుస్తులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం టౌన్ సిఐ ఆకుల రఘుకు, తహశీల్దార్ కార్యాలయంలో జెసికి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రాలు అందజేవారు. ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కైకలూరు ప్రాంతంలో విద్వేషాలు రెచ్చగొట్టడానికి వైసిపి నేతలు ఈ విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తగదన్నారు. వాటిని వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బ్యానర్లు తీయకపోతే జనసేన తరఫున ప్రతి గ్రామంలో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము సైతం బ్యానర్లు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి), నల్లగోపుల చలపతి, తోట లక్ష్మి, సొంటి రాజేశ్వరి, చెన్నంశెట్టి చిన్న, నాగరాజు, కడిమి శివ తదితరులు పాల్గొన్నారు.


టిడిపి ఆధ్వర్యాన వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని మెరకగూడెంలో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్‌చౌదరి సహకారంతో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, తామా నాగేశ్వరరావు, సున్నం పండు దొర, రమేష్ పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు మూసివేత దారుణం

కొత్తూరు జ్యూట్‌మిల్లు కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా


వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

చట్టవిరుద్ధంగా ఏలూరు జ్యూట్‌మిల్లును మూసేయడమే కాక యాజమాన్యం కనీసం న్యాయమైన పరిహారం చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కొత్తూరు జ్యూట్‌మిల్లు మేనేజ్‌మెంట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 2022 జనవరి 27న చట్టవిరుద్ధంగా మిల్లును మూసేసిన యాజమాన్యం ఇప్పటి వరకూ మిల్లును తెరవకపోవడమే కాకుండా కార్మికులకు చట్టప్రకారం రావాల్సిన రాయితీలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జ్యూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, న్యాయమైన పరిహారం చెల్లించాలని, కొత్తూరు మిల్లు కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని, ఏలూరు మిల్లును అడ్డం పెట్టి కొత్తూరుకు నార కొనకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్య వైఖరిని నిరసించారు. ధర్నా అనంతరం పర్సనల్ మేనేజర్ ఎన్‌ఎ.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పరిహారాల విషయంలో జ్యూట్‌మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చట్టప్రకారం రావాల్సిన రాయితీలు మొత్తం ఇవ్వాలని మొదట యూనియన్లు డిమాండ్ చేసినప్పటికీ, మిల్లు పరిస్థితుల రీత్యా వాటన్నింటినీ పక్కనపెట్టి నాలుగు నెలల జీతం, సంవత్సరానికి నాలుగున్నర వేల రూపాయల పరిహారం ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరాయని వివరించారు. అయినా మేనేజ్‌మెంట్ ముందుకు రావడం లేదని ఆరోపించారు. చివరిసారిగా మే 31న జెసిఎల్ వద్ద చర్చల్లో రెండు నెలల జీతం, మూడు వేల రూపాయలు పరిహారంగా మాత్రమే ఇస్తామని, అంతకుమించి పెంచేది లేదని మొండిగా సమాధానం చెప్పారని, ఇది ఎంత మాత్రం సరికాదని వారన్నారు. మేనేజ్‌మెంట్ తన వైఖరి మార్చుకుని కార్మికులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 6న జెసిఎల్ వద్ద చర్చల్లో యాజమాన్యం ముందుకొచ్చి సరైన పరిష్కారం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఏలూరు మిల్లుతో సంబంధం లేకుండా కొత్తూరు మిల్లుకు నార కొని పూర్తిస్థాయిలో కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్ల అప్పారావు, బద్దా వెంకట్రావు, కోసూరి నూకరాజు, కె.చిట్టయ్య, బగాది రమణ, బుడుమూరు శ్రీనివాస్, బుద్దా నాగేశ్వరరావు, శ్రీను, రంగారావు, నాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరులోని సుంకరవారి తోటలో శుక్రవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం అమ్మిన 21 రోజుల్లో సొమ్ము చెల్లిస్తామన్న ప్రభుత్వ నిబంధన సవరించాలని కోరారు. రైతులు పంట అమ్మిన వెంటనే సొమ్ము చెల్లించే విధానం తీసుకురావాలని కోరారు. ధాన్యం బకాయి సొమ్ము సకాలంలో చెల్లించకపోవడం వల్ల రైతులు పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ ధాన్యం బకాయి సొమ్ము రైతులు, కౌలురైతుల ఖాతాలకు జమ చేసి ఆదుకోవాలని కోరారు. వచ్చే వ్యవసాయ సీజన్ కు సంబంధించి కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, తలారి జయరాజు, అన్నంరెడ్డి రంగారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం


పరీక్షలు చేయించుకుంటున్న తహశీల్దార్

ఆగిరిపల్లి: పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లి శోభనాచల రామకృష్ణ భజన మందిరంలో గ్రామ ప్రముఖులు మాదల శివరామకృష్ణ (బుజ్జి) సహకారంతో చినఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ వైద్యబృందంచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఫిజూ, ఉదయ్‌కిరణ్, దుష్యంత్, అమిత, నిఖిత్, గిరిజాసింధు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు సస్పెన్షన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక జెడ్‌పి హెచ్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు జడ జగ్గారావును సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డివైఇఒ రామన్న దొర ప్రధానోపాధ్యాయులు గేడ జగ్గారావుకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన ఘటనపై బాలల హక్కుల కమిషన్, విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇటీవల జెడ్‌పి హెచ్ బాలుర పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు సుధాకర్ రెడ్డి, విజయప్రకాష్‌లను సస్పెన్షన్ చేశారు. అనంతరం విద్యార్థులను పోలీస్ స్టేషన్‌లో నిర్బందించడంలో బాధ్యతారాహిత్యం కనపరిచినట్లు విచారణలో నిర్ధారించిన ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయులు జగ్గారావును కూడా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని డివైఇఒ రామన్న దొర తెలిపారు.


దంపతులకు సాయం అందిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

బాధిత దంపతులకు సాయం

ప్రజాశక్తి - భీమడోలు

కుమార్తె ఆరోగ్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేసి ఉన్నదంతా అమ్ముకొని నిరాశ్రయులైన కోడూరుపాడుకు చెందిన దంపతులను ఆదుకునేందుకు భీమడోలుకు చెందిన అంబేద్కర్ యువజన సంఘం ముందుకు వచ్చింది. ఈ మేరకు శుక్రవారం కోడూరుపాడు వచ్చిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాచప్రోలు రాజకపూర్ బృందం కుమార్తెను కోల్పోయిన సదరు దంపతులను పరామర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఇతరాలు అందించారు. ఇదే క్రమంలో యువజన సంఘ సభ్యులు డి.పెద్దిరాజు, డి.రాజు, జి.మహేష్, కె.రమేష్ రూ.2500 నగదును అందించారు. రానున్న కాలంలో సైతం ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


నిడమర్రు గ్రంథాలయంలో విద్యార్థులు

వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతం

ప్రజాశక్తి - నిడమర్రు

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం 30 మంది బాలబాలికలకు చెస్, క్యారమ్స్ ఆటల్లోని మెలకువలను ఇంటి ఉదయ భాస్కర్ వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏ కోర్సు తీసుకుంటే బాగుంటుందో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ పాలకులు బాలరాజు అధ్యక్షత వహించారు.

మండవల్లి : పేద విద్యార్థులు విద్యలో ఎదురయ్యే ఆర్థిక పరిస్థితులను అధికమించి విద్యలో రాణించేందుకు ఐ ఎం కలాం అనే చిత్రం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పరివిన స్పష్టం చేశారు. గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే పలు అవార్డులు అందుకున్న లఘు చిత్రాలను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థి చదువుకోవాలనే తాపత్రయంతో విద్యలో ఎదురయ్యే అడ్డంకులను ఎదిరించి ఏ విధంగా తన స్కూల్ జీవితాన్ని ప్రారంభించాడనేది ఐ ఎం కలాం చిత్రంలో విద్యార్థులకు చూపించారన్నారు. ఈ చిత్రం విద్యార్థులు ఎంతో ఆసక్తిని కనబరిచి తిలకించారని ఆమె తెలిపారు.


పండుగ వేడుకల్లో గిరిజనులు

గిరిజన గ్రామాల్లో ఘనంగా భూదేవి పండుగ

ప్రజాశక్తి - పోలవరం

గిరిజన గ్రామాల ప్రజలు ప్రతి ఏటా అత్యంత వైభవంగా భూదేవి పండుగ జరుపుకుంటారు. భూదేవి పండుగ సందర్భంగా మండలంలోని జిల్లెలగూడెం పంచాయతీ రెడ్డి కుంకాల గ్రామంలో శుక్రవారం డోలు వాయిద్యాలతో గిరిజన సంప్రదాయ నృత్యాలతో గిరిజనులు భూదేవి పండుగ జరుపుకున్నారు. గిరిజనులు అత్యంత వైభవంగా జరుపుకునే ఈ పండుగ వేడుకల్లో ఏలూరు జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని గిరిజన మహిళలతో పాటు గిరిజన సంప్రదాయ నృత్యం చేసి సందడి చేశారు. నేటి యువత విదేశీ సంస్కృతి వెనక పరిగెడుతున్న ఈ రోజుల్లో కూడా అనధికాలంగా వస్తున్న గిరిజన సాంప్రదాయాలను, ఆచారాలను గిరిజనులు నేటికి ఆచరించడం అభినందించాల్సిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకట రెడ్డితో పాటు జిల్లెల్లగూడెం సర్పంచి కోటం గంగాదేవి, పార్టీ నాయకులు కోటం బాబురావు, రమేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోవులను తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మూడు కంటైనర్లలో 200కుపైగా గోవులను తరలిస్తుండగా కంటైనర్లను మండలంలోని తుక్కులూరు గ్రామంలో గోసంరక్షణ సమితి సభ్యులు నిలిపి వేసి పోలీసులకు సమాచారం అందించారు. సిఐ ఆర్.అంకబాబు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మూడు కంటైనర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు, గోవులను గో సంరక్షణ శాలకు తరలించారు.

యువకునిపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తనతో అసభ్యంగా ప్రవర్తించాడని మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన మహిళ అదే గ్రామానికి చెందిన యువకునిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 22వ తేదీన గుడిపాడులో రాత్రి కరెంట్ పోయిన సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు రాజబోయిన నాగరాజు ఇంట్లోకి వచ్చి తనపై అఘాయిత్యానికి పాల్పడేందుకు యత్నించగా తాను గట్టిగ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి పారిపోయాడని మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా మినీ బస్టాండ్

ప్రయాణికులు, చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు

వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల డిమాండ్

పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న మినీ బస్టాండ్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పాత బస్టాండ్ వద్ద ఉన్న మినీ బస్టాండ్ ఎందుకు వినియోగంలోకి తీసుకురావడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసమర్థత, నిర్లక్ష్యమా, మాకేందుకులే ఆలోచన ధోరణి కారణమా అని విమర్శిస్తున్నారు. సుమరు 15 ఏళ్ల క్రితమే రూ.లక్షల వ్యయంతో నిర్మించిన మినీ బస్టాండ్‌ను నేటికీ వినియోగంలోకి తీసుకురావడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన మినీ బస్టాండ్ నిరూపయోగంగా ఉందని, పట్టించుకోవాలని అధికారులకు పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మించి ఉన్న మినీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో ఎందుకు విఫలమవుతున్నారన్నారు. పట్టణం నుంచి ప్రతిరోజు ఏలూరుకు అనేక మంది ప్రయాణిస్తూ ఉంటారు. ప్రయాణికులు ఎండలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిరూపయోగంగా ఉన్న మినీ బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం


తోర్లపాటి లక్ష్మీకాంతం, పాత చింతలపూడి

చింతలపూడి పాత బస్టాండ్ వద్ద లక్షల రూపాయలతో నిర్మించిన మినీ బస్టాండ్ నిరూపయోగంగా ఉంది. మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం ఎండలో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేని పరిస్థితి. అధికారులు స్పందించి బస్టాప్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం

నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

బస్టాండ్‌ను త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం. ఇప్పటికే ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికుల, మహిళల, వృద్ధుల, చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అతి త్వరలోనే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.


అధికారికి వినతిపత్రం అందిస్తున్న చిన్నం మాధవ

సమస్యలు పరిష్కరించాలని వ్యకాస వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత 25 ఏళ్లుగా వణుదుర్రు గ్రామంలో దళితులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ముదినేపల్లి మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు లేవని, మంచినీరు సమస్య, డ్రెయినేజీ సమస్యలతో పాటు శ్మశాన వాటికకు స్తంభాల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కొత్తపల్లి నుంచి వణుదుర్రు, దేవపూడి వరకు ప్రధాన రోడ్డు వెంబడి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామంలోని మెట్ల రేవును అభివృద్ధి చేయాలని, నడవడానికి కాల్వపై వంతెన సౌకర్యం ఏర్పాటు, ప్రజలు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రంలో కోరారు. మాధవ ఇచ్చిన వినతిపత్రంలో ఉన్న సమస్యలపై సంబంధిత అధికారి నారాయణమూర్తి సానుకూలంగా స్పందించినట్లు మాధవ తెలిపారు. మాధవతో పాటు బొడ్డు సురేష్ ఉన్నారు.

నూజివీడు ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎంపిడిఒను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూజివీడు ఎంపిడిఒ జి.రాణి ముసునూరు ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతి పొందిన 14 మందిని జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 11 మంది జెడ్‌పిలో రిపోర్ట్ చేశారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని జైనవారిగూడెం చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిపి కారం శాంతి, ఎంపిడిఒ శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి హామీ కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సుజాత, సర్పంచి తాటి సీత, ఎపిఒ ఆలీ పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి కారం శాంతి మండలంలోని బుట్టాయగూడెం, కోటనాగవరం సచివాలయాలను సందర్శించారు.

వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైఎస్ఆర్ బీమా పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి సర్పంచి చౌటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన సాక్షి ఆగిరిపల్లి మండల విలేకరి అస్సానుబాదు చంద్రశేఖర్ కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ద్వారా మంజూరైన వైఎస్ఆర్ బీమా రూ.పది వేలు శుక్రవారం అందించారు. చంద్రశేఖర్ భార్యకు సర్పంచి, ఎంపిటిసి సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి దాత విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయానికి దాతలు బోను అప్పలనాయుడు, నాగమణి కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళం అందించారని ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన దాతలు కీర్తిశేషులు బోను జోగయ్య, నూకాలమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.25,116 విరాళంగా అందించారని తెలిపారు. ఈ నేపథ్యంలో దాతలకు నూకాలమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నాణ్యమైన విత్తనాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న సమయంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిమ్మడ్డ నరసింహ మాట్లాడుతూ గత సీజన్‌లో రైతులు చాలా నష్టపోయారన్నారు. ఇది గమనించి ఈసారి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు


ఫుడ్ బ్యాస్కెట్లను దాత, సిహెచ్‌సి వైద్య బృందం

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ సునీత తెలిపారు. టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం కింద సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దాత ఉన్నమట్ల సత్యనారాయణ ఐదుగురు టిబి వ్యాధిగ్రస్తులకు టిబి ఫుడ్ బ్యాస్కెట్ పేర నిత్యావసర వస్తువులు, మందులు, పౌష్టికాహారం, ఇతరాలను అందించారు. ఇదే క్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు బి.రవిపాల్, డాక్టర్.రష్మి, డాక్టర్ ఆల్బర్ట్, టిబి రోగులు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టిబి వ్యాధిగ్రస్తులకు సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం టిబి యూనిట్ పర్యవేక్షకులు తోట మనోజ్‌కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ సింహాద్రి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం : ఎంపిపి

ప్రజాశక్తి - కైకలూరు


పైపులైను పనులు పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆనందరావుపేట గ్రామస్తులు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారని ఎంపిపి అడవి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆచవరం శివారు ఆనందరావుపేటలో మంచినీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి కృష్ణమోహన్ మాట్లాడుతూ పనులు పూర్తి చేసి గ్రామానికి మంచినీరు సరఫరా చస్తామన్నారు. అనంతరం గృహ నిర్మాణ లబ్ధిదారులను కలిసి బ్యాంకు రుణాల కోసం అధికారులతో చర్చించారు. ఆయనతో పాటు షేక్ రఫీ, తోట మహేష్, ఆచవరం వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

విద్యాదీవెన కిట్లను సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - మండవల్లి


కిట్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి పుష్పలత

జగనన్న విద్యా దీవెన కిట్లను విద్యార్థులకు సకాలంలో అందించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మండల ప్రత్యేక అధికారి ఎన్.పుష్పలత తెలిపారు. విద్యాదీవెన కిట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు విద్యలో ఎటువంటి ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తుందన్నారు. అంతే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల విద్యకు ఆటంకం కలిగించకుండా ఉండే విధంగా జగనన్న విద్యా కానుకను ప్రవేశపెట్టిందన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు బ్యాగులు, బెల్ట్‌లు, యూనిఫాం, బూట్లు, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ నోట్ పుస్తకాలను పూర్తిస్థాయిలో అందిస్తుందన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీలేని ఐఎస్ఒ మార్క్ సర్టిఫికెట్ చేసిన కిట్లను విద్యార్థులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ కిట్లను పాఠశాల పున:ప్రారంభానికి ముందుగానే పాఠశాలలకు చేర్చే విధంగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పాఠశాలలకు పంపే జగనన్న విద్యా కిట్లను పూర్తిస్థాయిలో పరిశీలించి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కె.నరేష్‌కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జగనన్న విద్యా కానుక మండల కమిటీ సభ్యులు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు సమిష్టి కృషి



మలేరియా మాసోత్సవాల్లో అధికారులు, ఆశాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మలేరియా నివారణలో ప్రజల భాగస్వామ్యం కావాలని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కోరారు. శుక్రవారం చేబ్రోలు పిహెచ్‌సిలో వైద్యాధికారులు డాక్టర్ కెఎస్.వర్మ, డాక్టర్ శ్రావన్ కుమర్ రెడ్డి అధ్యక్షతన మలేరియా మాసోత్సవాలు తాడేపల్లిగుడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మలేరియా నిర్ధారణ పరీక్షలు ఆరోగ్య కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌లలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. నివారణ చర్యల్లో భాగంగా దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు పరమేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి చంద్రకళ, ఆశాలు, ఆరోగ్య సహాయకులు వెంకటస్వామి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వెస్టిజ్ కంపెనీ వార్షికోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

భవిష్యత్తులో నిరుద్యోగులకు వెస్టిజ్ కంపెనీ డైరెక్ట్ సెల్లింగ్‌లో ఉపాధి కల్పిస్తుందని వెస్టిజ్ మిల్లినిర్స్ కౌన్సిల్ సభ్యులు విజయరాజు అన్నారు. పట్టణంలో వెస్టిజ్ మార్కెటింగ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ 19వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ 2004 జూన్ రెండో తేదిన రెండు ఆర్గానిక్ ఉత్పత్తులతో, ఆరుగురు డిస్ట్రిబ్యూటర్స్‌తో, ఢిల్లీ, బెంగుళూరులలో కంపెనీ ప్రారంభమై నేడు 19 సంవత్సరాలు పూర్తి చేసుకొని నాలుగు కోట్ల పైబడి డిస్ట్రిబ్యూటర్స్, 3500 ఆఫీస్‌లతో తొమ్మిది దేశాలకు విస్తరించిందని తెలిపారు.

సంక్షేమ పథకాలకు పెద్దపీట : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో చంద్రబాబు సంక్షేమ పథకాలు ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో చంద్రబాబు చిత్ర పటానికి శుక్రవారం టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే బిసిలకు రక్షణ చట్టం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1500, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు, వ్యవసాయ పెట్టుబడులకు ఏడాదికి రూ.20 వేలు, యువగళం ద్వారా నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, నల్లూరి వెంకట చలపతిరావు, కొండపల్లి రవి, ఆచంట అనిల్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో నాణ్యమైన ఆహారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నెల రోజుల్లో కొత్త టెండర్ పిలవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌జియుకెటి ఛాన్స్‌లర్ ఆచార్య కేసి రెడ్డి తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటి కళాశాలలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ టెండర్ పిలిచిన మూడు నెలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేని మెనూ అందించేలా ప్రణాళిక బద్ధంగా ఆహారంలో లోపాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అనధికార ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల వల్ల విభేదాలు పెరిగి సమాజంలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తున్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి మండలాల్లో రహదారుల వెంబడి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు కడుతున్నారని పేర్కొన్నారు. వీటివల్ల రహదారి ప్రమాదాలతో పాటు వివాదాలు చోటు చేసుకుం టున్నాయని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకో వాలని నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అర్జీ ద్వారా విజ్ఞప్తి చేశామని తెలిపారు. అనంతరం ఫ్లెక్సీలను పూర్తిస్థాయిలో తొలగించారని తెలిపారు. తిరిగి మళ్లీ అనుమతి లేకుండా ఫ్లెక్సీ లను భారీ స్థాయిలో ఏర్పాటు చేయడంతో వివాదాస్పదమ య్యాయని తెలిపారు. ఉన్నతాధికా రులు స్పందిం చి అనధికార ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించేలా అవగాహన కల్పించాలని చింతలపూడి సబ్ యూనిట్ అధికారి బి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగలపల్లి గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే కార్యక్రమం అమలును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా దోమకాటు వ్యాధుల నుంచి ప్రజలను రక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి అరుణ, సునీత, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఉచిత వాటర్ ట్యాంక్ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి సరఫరా ట్యాంకు ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధరావు అన్నారు. అమ్మ స్వచ్ఛంద సేవా వ్యవస్థాపకులు కురెళ్ల రాంబాబు పుట్టినరోజును పురస్కరించుకుని ఉచిత తాగునీటి సరఫరా ట్యాంకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటర్ ట్యాంక్‌ను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గురునాధరావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడాలనే ఆలోచనతో రాంబాబు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రాంబాబు మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తిన ప్రాంతాల్లో ఉచిత వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

సంచార వ్యాన్ ద్వారా మజ్జిగ

ప్రజాశక్తి - ఉంగుటూరు

వేసవి కాలంలో వడగాల్పుల బారిన పడకుండా ఉపశమనం కలిగించేందుకు ఉపాధి కూలీలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. 17వ రోజు శుక్రవారం ధర్మరాజు చేతుల మీదుగా ఉంగుటూరులో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. నాచుగుంట, బాదంపూడి, ఉప్పాకపాడు గ్రామాల్లో పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ అందించారు. గత నెల 17వ తేదీన మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల ప్రజలకు నిరంతరాయంగా మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి

ఏలూరు టౌన్ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నగర కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఏలూరు ఆర్‌టిసి ఆర్ఎంఒని కలిసి బైపాస్ నుంచి వచ్చే బస్సులను రాత్రి ఎనిమిది గంటల నుంచి కాంప్లెక్స్‌కు వచ్చి ఆపాలని కోరుతూ వినతిపత్రం అందతించారు. ఏలూరు డిఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.